# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.**
2. **ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో 141 కోట్ల రూపాయల విలువైన సొత్తు జప్తు చేశామని ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ నగర పోలీస్ కమిషనర్ కాంతిరాణాను బదిలీ చేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.**
4. **తెలంగాణలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలను ఈ రోజు ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.**
5. **ఈరోజు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

==========================

రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో తాగునీరు, ఉపాధి హామీ పనులు, నీటి సరఫరా, విద్యుత సరఫరాపై నిన్న ఆయన కలెక్టర్లతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి పనులు నిర్వహించిన కూలీలకు సకాలంలో సొమ్ము చెల్లించాలని సూచించారు. ప్రకాశం బ్యారేజి, నాగార్జున సాగర్ కుడి కాల్వ ద్వారా విడుదల చేసిన నీటితో సకాలంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఉన్న ఆవాసాలు, కాలనీలకు ట్యాంకులు ద్వారా మంచినీటిని సరఫరా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని జవహర్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు.

--------------------------

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రభావితం చేసే అన్ని అంశాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్.. త్రిబుల్ "సి" పేరుతో ఈ వ్యవస్థ పనిచేస్తోంది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా స్వయంగా దీనిని పర్యవేక్షిస్తున్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దులు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 424 చెక్‌పోస్టుల్లో సుమారు 358 చెక్‌పోస్టుల మీదుగా వెళ్లే వాహనాల కదలికలను వెబ్ కాస్టింగ్ ద్వారా ఈ కేంద్రం నుంచే పర్యవేక్షిస్తున్నారు. ఫలితంగా

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా అధిక మొత్తంలో 141కోట్ల రూపాయల విలువైన నగదు, సొత్తు జప్తు చేశామని ఎన్నికల ప్రధానాధికారి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మరో ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులను ఎన్నికల సంఘం బదిలీ చేసింది. ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ నగర పోలీస్ కమిషనర్ కాంతిరాణాను బదిలీ చేస్తూ ఎన్నికల సంఘం నిన్న ఆదేశాలు జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికలతో సంబంధం లేని విధులు వారికి అప్పగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ రోజు మధ్యాహ్నం 3గంటల్లోగా వారి స్థానాల్లో కొత్త వారిని నియమించేందుకు వీలుగా ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున అధికారుల పేర్లతో కూడిన ప్యానెల్‌ను పంపాలని ప్రభుత్వానికి సూచించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఈ రోజు ముగియనుంది. గత నెల 27వ తేదీన వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులో మొదలైన బస్సు యాత్ర నిన్న రాత్రి శ్రీకాకుళం జిల్లాలోకి ప్రవేశించింది. ఎచ్చెర్ల నియోజకవర్గం అక్కివలసలో జగన్మోహన్ రెడ్డి రాత్రి బస చేశారు. ఈ రోజు మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే 'మేమంతా సిద్ధం' ముగింపు సభలో ఆయన పాల్గొంటారు.

కాగా.. నిన్న విజయనగరం జిల్లా చెల్లూరులో జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలతో రైతులకు మేలు చేకూర్చామని అన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో తాము అధికారంలోకి వస్తే రాబోయే ఐదేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకు వెళతామని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం, ఆమదాలవలసలో నిన్న నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన ప్రసంగించారు. తాము అధికారంలోకి వచ్చాక స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

---------------------------

గడిచిన ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల విమర్శించారు. బాపట్ల జిల్లా కర్లపాలెంలో నిన్న జరిగిన బహిరంగసభలో ఆమె ప్రసంగించారు. ప్రజల అవసరాలు పట్టించుకోని అధికార పార్టీ నేతలకు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని షర్మిల హామీ ఇచ్చారు.

---------------------------

ప్రస్తుత ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్‌కు ఎంతో కీలకమైనవని.. అందుకోసమే తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడ్డామని జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కల్యాణ్ తెలిపారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం, ఉప్పాడలో నిన్న నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ..

ఎన్నికల్లో విజయం సాధించి కూటమి నేతృత్వంలో ప్రభుత్వం రాగానే ప్రతి రైతుకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఉప్పాడలో మత్స్యకారుల కోసం హార్బర్ నిర్మించడానికి 422 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉన్నా ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే.. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు 24 శాతం నుంచి 34 శాతం వరకు పెంచుతామని.. మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం పెంచుతామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు.

---------------------------

తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు ఈ రోజు విడుదల కానున్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలను ఒకేసారి విడుదల చేయనున్నారు. ఈ ఫలితాలను నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఉదయం 11 గంటలకు విడుదల చేస్తారు. కాగా.. ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ నుంచి మార్చి 19వ తేదీ వరకు జరిగిన ఇంటర్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల 80 వేల 978 మంది విద్యార్థులు హాజరయ్యారు.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎండ తీవ్రత, వడగాడ్పుల పెరుగుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి సహా పలు జిల్లాల్లో 66 మండలాల్లో నిన్న తీవ్ర వడగాడ్పులు వీచాయి. రాష్ట్రవ్యాప్తంగా 84 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీచాయి. నంద్యాల జిల్లా చాగలమర్రిలో 45.1, విజయనగరం జిల్లా జామిలో 44.9, కడప జిల్లా ఖాజీపేటలో 44.6, కర్నూలు జిల్లా వగరూరులో 44.2, అనకాపల్లి జిల్లా దేవరపల్లెలో 44.1 అనంతపురం జిల్లా తెరన్నపల్లిలో 43.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ రోజు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాల్లోని 46 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని, శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు 143 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

మరోవైపు.. తెలంగాణ రాష్ట్రంలో కూడా 45 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మిర్యాలగూడలో నిన్న 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఈరోజు, రేపు కొన్ని జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది.

---------------------------

అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న క్రమంలో రైల్వే శాఖను భారత వాతావరణ శాఖ..ఐఎండీ అప్రమత్తం చేసింది. వడగాడ్పుల ప్రభావంతో రైలు ప్రయాణికులు వడదెబ్బకు గురవుతారని హెచ్చరించింది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ, ఝూర?ండ్, పశ్చిమబెంగాల్, బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో వడగాడ్పుల తీవ్రత అధికంగా ఉందని ఐఎండీ పేర్కొంది. రైల్వే స్టేషన్లు, ప్లాట్‌ఫారాలు, రైలు కోచలలో సరిపడినంత తాగునీరు అందుబాటులో ఉంచాలని రైల్వేశాఖకు సూచించింది. స్టేషన్లు, ప్లాట్‌ఫారాలపై గదుల్లో ఎక్కువ ఫ్యాన్లు ఉంచాలని, చల్లని వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. రైళ్లలో వైద్య బృందాలు, మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఐఎండీ సూచించింది.

---------------------------

ఈరోజు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. పంచాయితీలకు సాధికారత కల్పించే

లక్ష్యంతో మనదేశంలో ప్రతీ ఏటా ఏప్రిల్ 24వ తేదీన జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. రాజకీయ అధికారాన్ని వికేంద్రీకరించి క్షేత్రస్థాయిలో అభివృద్ధి సాధించే దిశగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే పాలిసెట్-2024 సన్నాహక, సన్నద్ధతలో భాగంగా పాలిసెట్ గ్రాండ్ టెస్టును ఈరోజు నిర్వహిస్తున్నారు. ముందుగా ఈ పరీక్షను రేపు నిర్వహించాలని భావించినా, ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష నేపథ్యంలో విద్యార్థుల నుండి వచ్చిన వినతుల మేరకు ఒక రోజు ముందుగా నిర్వహిస్తున్నామని.. సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పాలీసెట్ ప్రవేశ పరీక్ష కోసం సాంకేతిక విద్యా శాఖ ఈ నెల 1వ తేదీ నుండి అందించిన ఉచిత శిక్షణకు ముగింపుగా, ప్రవేశ పరీక్షపై పూర్తి అవగాహన కల్పించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆమె అన్నారు. పాలిసెట్ గ్రాండ్ టెస్టుకు ఎటువంటి ప్రవేశ రుసుము లేదని, పాలిటెక్నిక్‌లో చేరాలనుకునే ఏ విద్యార్థి అయినా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

---------------------------

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఈ రోజు నుంచి రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టనున్నారు. ఈ యాత్ర 17 రోజులపాటు కొనసాగి మే 10వ తేదీన సిద్ధిపేటలో ముగియనుంది. ప్రతి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో.. ఒకటి, రెండు శాసనసభ నియోజకవర్గాల్లో పర్యటన సాగేలా, 21 రోడ్ షోలు నిర్వహించే విధంగా ఈ యాత్రకు ప్రణాళిక రూపొందించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 2023-24 విద్యా సంవత్సరం నిన్నటితో పూర్తయ్యింది. ఈరోజు నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. తిరిగి జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది పాఠశాలలు మొత్తం 229 రోజులు పనిచేశాయి. 88 రోజులు సెలవులు వచ్చాయి. మధ్యలో వివిధ కారణాలతో తప్పక ఇచ్చిన సెలవులకు బదులుగా రెండవ శనివారాలు బదులు పనిచేశాయి.

======================